## క్లుప్తంగా

### పెండింగ్ వేతనాలను చెల్లించాలి


వేతనాలు చెల్లించాలని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**ముదిగుబ్బ:** పెండింగ్‌లో వేతనాలను వెంటనే చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు కిరణ్‌మోహన్, ఆదినారాయణ, ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు 10 నెలలుగా వేతనాలను చెల్లించకుండా కాలయాపన చేస్తోందన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందన్నారు. ఇకనైనా పెండింగ్‌లో వేతనాలను చెల్లించి ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు నాగరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

**ఓడీచెరువు:** డబురువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై అమరాపురానికి వెళ్లిన ఉపాధ్యాయుడు కె.నాగరాజుకు గ్రామస్తులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎంతోగానో కృషి చేశాడని, బదిలీపై వెళ్లడం ఎంతో బాధ కలిగిస్తోందన్నారు. విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు ఒంటిపూట బడుల సమయంలో సొంత ఖర్చుతో పిల్లలకు టిఫిన్ ఏర్పాటు చేశారని కొనియాడారు. పాఠశాల హెచ్‌ఎం చంద్రమౌళి, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరంగారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ చంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### యోగా గురువులకు సత్కారం


యోగాగురువులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**ధర్మవరం అర్బన్:** గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ప్రెస్‌క్లబ్‌లో ధర్మవరం యోగా అసోసియేషన్, నిత్య ధ్యాన యోగ సాధన కేంద్రం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా గురువులు ఈశ్వరయ్య దంపతులు, వెంకటేష్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డికి యోగ సాధకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రతిఒక్కరూ గురువులను పూజించాలని సూచించారు. మున్సిపల్ టీపీఎస్ విజయభాస్కర్, యోగ అసోసియేషన్ సభ్యులు కట్టా రవికుమార్, శీలా నాగరాజు, కోనాపురం సాయిప్రసాద్, యోగ సాధకులు పాల్గొన్నారు.

### వాటర్ ఫిల్టర్ వితరణ


ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్

**గాండ్లపెంట:** మలమీదపల్లి ఉన్నత పాఠశాలకు సర్పంచ్ పోతినేని కళావతి, చలపతి దంపతులు వాటర్ ఫిల్టర్‌ను పాఠశాల హెచ్‌ఎం హైదర్‌వలీకి గురువారం దంపతులు అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాలను ఇటీవల ఉన్నత పాఠశాలగా మార్పు చేశారు. దీంతో పాఠశాలకు చుట్టుపక్క గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు మంచి నీటి కోసం ఇబ్బందులు పడకూడదని రూ.15 వేల విలువ చేసే మినరల్ వాటర్ ఫిల్టర్‌ను అందించినట్లు సర్పంచ్ కళావతి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**కనగానపల్లి:** మండలంలోని దాదులూరు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పెనుగొండ మండల నాగలూరు చెందిన కుమార్ అనే యువకుడు ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్తుతుండగా.. రహదారిపై డివైడర్‌ను ఢీకొని కింద పడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన కుమార్‌ను వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# సాయి చరణం..పాపహరణం


బత్తలపల్లిలో పూజలు అందుకుంటున్న షిర్డీసాయి బాబా మూలవిరాట్


ధర్మవరం సాయినగర్ షిర్డీసాయిబాబా ఆలయంలో బాబా పాదదర్శనం చేసుకుంటున్న భక్తులు


భక్తులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి సత్యకుమార్, షిర్డీసాయిబాబా సేవా సమితి సభ్యులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని సాయినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి కనుల పండువగా సాగాయి. ఉదయం కాగడా హారతి, అభిషేకం, సాయినామ సంకీర్తన చేశారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు షిర్డీసాయిబాబా పాదదర్శనం గావించారు. షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు వీరనారాయణ, నారాయణరెడ్డి, రామలింగయ్య, బంధనాథం సూర్యప్రకాష్, నాయుడు, సూర్యనారాయణ తదితరులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**• రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ప్రత్యేక పూజలు**

షిర్డీసాయిబాబా ఆలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో షిరిడిసాయిబాబా పాద దర్శనం చేసుకున్న మంత్రి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని పూజలు చేపట్టారు.

**బత్తలపల్లి:** గురుపౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురువారం మండల కేంద్రం, రామాపురం, సంఘమేశ్వరక్షేత్రంలోనూ సాయి బాబా ఆలయాల్లో అర్చకులు ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజలు పెద్ద ఎత్తున సాయినాథుడిని దర్శించుకున్నారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం, సామూహిక సాయి వ్రతాలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయంలో, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ ఆలయం, గంటాపురం అప్పస్వామి ఆలయంలోనూ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మాల్యవంతంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీమతమ్మ, రామాపురం నెప్పల్లి వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు:** మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో సాయిబాబా భక్తాదులకు దర్శమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేంద్ర, సత్యనారాయణ, సతీష్, ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, రామ్‌దేశాయ్, బాల్‌రెడ్డి, గోపాల్, చిదానందరెడ్డి, హరీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**తాడిమర్రి:** స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. ఉదయం ఆలయం పక్కన ఏర్పాటు చేసిన బాబా చిత్రపటానికి భక్తులు క్షీరాభిషేకం నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో వెలసిన బాబా విగ్రహానికి ప్రదక్షిణలు చేసి, కానుకలు చదివించి మొక్కులు తీర్చు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి అధిక సంఖ్య భక్తులు భజనలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

**నల్లమాడ:** స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నాగేంద్ర స్వామివారి మూలవిరాట్‌ను రంగు రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంలో స్వామివారిని దర్శించుకొని కాయ, కర్పూరం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం బాబా చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి భక్తుల భజనల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

**అమడగూరు:** మండలంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. జేకేపల్లి, అమడగూరులోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో అంగరంగ వైభవంగా పూజలు జరిపించారు. జేకేపల్లి ఆలయంలో అనంతపురానికి చెందిన శ్రీనివాసుల నాయుడు, సుమతి దంపతులు అన్నదానం నిర్వహించారు.

**కనగానపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు గురువారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి గ్రామంలో షిర్డిసాయి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం ప్రత్యేక పూజలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు షిర్డి సాయినాథుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**నల్లచెరువు:** మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయి మందిరంలో బాబా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి సాయిబాబాను దర్శించుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.



బత్తలపల్లిలో వేడుకలకు హాజరైన మహిళలు

### భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


కదిరి వాణివీధిలో పూజలందుకున్న షిర్డీసాయిబాబా


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


**కదిరి టౌన్:** పట్టణంలోని వాణివీధిలో షిర్డీ సాయిబాబా, కోనేరు వద్ద ఉన్న షిర్డీసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో మొదట గణపూజతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం సాయిబాబా మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాల అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. బాబాను దర్శించుకోవడానికి భక్తులు బారులుదీరారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.


తాడిమర్రిలో పూజలందుకున్న షిర్డీసాయి బాబా


తనకల్లు: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


నల్లమాడలో పూజలు అందుకుంటున్న సాయిబాబా


మామిళ్లపల్లిలో అలంకరణలో సాయినాథుడు


నల్లచెరువు: పూజలందుకున్న షిర్డీ సాయిబాబా

## వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి


ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రామయ్యను పరామర్శిస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**తాడిమర్రి:** మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. ఇటీవల వైఎస్సార్ సీపీ మండల కమిటీలో పెద్దకోట్ల గ్రామానికి చెందిన జీ.నారయ్యకు ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. దీంతో గురువారం ఆయన ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలసి ధర్మవరం వెళ్లి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, గద్దె మురళీమోహన్‌రెడ్డి, అశ్వత్థరెడ్డి, నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మండల కన్వీనర్ పరామర్శ**

**ధర్మవరం రూరల్:** వైఎస్సార్‌సీపీ ధర్మవరం మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం పోతుకుంట గ్రామానికి వెళ్లి రామయ్యను పరామర్శించారు. ఇటీవల చాతీలో నొప్పి రావడంతో హుటాహుటినా బెంగళూరుకు తరలించి అక్కడ చికిత్స చేయించారు. ఈ సందర్భంగా రామయ్య ఆరోగ్య పరిస్థితిపై కేతిరెడ్డి ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా, వెంకటేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


సూర్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**బత్తలపల్లి:** సంగాల మాజీ సర్పంచు సూర్యనారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం అందుకున్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం మాజీ సర్పంచును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జాగ్రత్తగా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

**పుట్టపర్తి టౌన్:** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు సీఎం చంద్రబాబును కోరారు. గురువారం వారు కొత్తచెరువు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రాబాబును సత్యసాయి విమానాశ్రయంలో కలసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తిలో నూతన ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించడంతోటు భవన నిర్మాణం చేపట్టాలన్నారు. అర్హులైన జర్నలిస్టుందరికీ ఇంటిస్థలాలు మంజూరు చేయాలన్నారు. గతంలో జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. ఎలాంటి ఆంక్షలు విధించకుండా అక్రిడిటేషన్ కార్డులు అందించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యనందించాలన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో స్పౌజ్ కేటగిరీ వర్తింపజేయాలని విన్నవించారు. తమ వినతికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యాదర్శి బాబు, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పలు వార్డుల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎరగుంటలో గురువారం పీర్లస్వాములను కొలువుదీర్చి ప్రత్యేక పూలు, వస్త్రాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా యువకులు అగ్నిగుండం చుట్టూ అలావు తొక్కారు.

**భక్తిశ్రద్ధలతో జార్తాల్ కార్యక్రమం**

**బత్తలపల్లి:** మండలంలోని మాల్యవంతం, వెంకటగారిపల్లి, అనంతసాగరం, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి, గంటాపురం, వేల్పుమడుగు తదితర గ్రామాల్లో గురువారం జార్తాల్(దినాలు) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం అనంతరం రెండురోజులకు పెద్ద ఖాశీంస్వామికి జార్తాల్ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో పీర్లమకాన్ వద్ద స్వాములకు ప్రత్యేక చదివింపులు గావించారు. దీంతో తమ ఇష్టదైవమైన పెద్ద కాశీం స్వామి చివరి దర్శనం చేసుకోవడానికి ఆయా గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు చక్కెర చదివించుకున్నారు. చివరి దర్శనం అనంతరం పీర్లను పెట్టెలో భద్రపరిచారు. అనంతరం ఆలయంలోని అటకమీద భద్రపరిచారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


విద్యార్థినికి నగదును అందజేస్తున్న అధికారులు

**తనకల్లు:** విద్యార్థులు కష్టపడి చదువుకోవడం ద్వారా అత్యున్నత శిఖరాలకు అధిరోహించాలని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొండ్ల జయమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి టాపర్స్‌కు గురువారం నగదు బహుమతులను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి కొండ్ల చంద్రమోహన్ తన తల్లి పేరు మీద ట్రస్ట్‌ని ఏర్పాటు చేసి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు బహుమతులను అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విష్ణువర్ధన్‌కు రూ.10 వేలు, మెహతాజ్‌కు రూ.7 వేలు, హన్సికకు రూ. 5 వేలు నగదును అందించారు. ఎంపీడీఓ రామానాయక్, ట్రస్ట్ ప్రతినిధి యోగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

**చెన్నేకొత్తపల్లి:** మండల పరిధిలోని ఆమిదాలకుంటకు చెందిన చరణ్ అనే విద్యార్థి కనుముక్కల ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 577 మార్కులు సాధించాడు. మండల టాపర్‌గా నిలవడంతో అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఏఎన్ ఓబులేసు తన వంతు సాయంగా రూ.5116 అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు మున్వర్‌భాష, ప్రసూన్ కుమార్‌నాయుడు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**పుట్టపర్తి టౌన్:** 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్ గౌడ్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

### క్రమశిక్షణ అలవర్చుకోవాలి

**సాక్షి బృందం:** విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవలని వక్తలు పేర్కొన్నారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతి, పాఠశాలల్లో వసతులు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులతో తల్లులకు పాదపూజ చేయించారు. అనంతరం విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

### బీజేపీ మండలాధ్యక్షుడిగా శివ

**రామగిరి:** మండల బీజేపీ అధ్యక్షుడిగా పెనుబోలు గ్రామానికి చెందిన చిత్రా శివను గురువారం ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కనంపల్లి చిరంజీవి రెడ్డి, జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య కిశోర్, నాయకులు కోడి రామ్మూర్తి, ఆంజనేయులు, గాజుల శ్రీనాథ్, సంజీవరెడ్డి, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### రేపు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

**ధర్మవరం:** పట్టణంలోని మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### దళవాయి చలపతిని సన్మానించిన మంత్రి


దళవాయి చలపతిని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

**ధర్మవరం రూరల్:** పద్మశ్రీ అవార్డు గ్రహీత, తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిని గురువారం మంత్రి సత్యకుమార్ సన్మానించారు. నిమ్మలకుంట గ్రామంలో వున్న దళవాయి చలపతి ఇంటికి వెళ్లి మంత్రి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తోలుబొమ్మల కళకు ప్రత్యేకతను తీసుకురావడంలో దళవాయి చలపతి పాత్ర మరువలేనిదన్నారు.

**ముదిగుబ్బ:** రహదారి విస్తరణలో భాగంగా కోట్లాది రూపాయలు విలువ చేసే భూములు కోల్పోతున్న రైతులు తమ బాధలను గురువారం పుట్టపర్తికి విచ్చేసిన మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్‌నాయుడు తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సంప్రదించి బాధత రైతులకు న్యాయం చేస్తామని వారు హామీనిచ్చారు.

### విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న దాతలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని సుందరయ్యనగర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. మడకం చౌడయ్య జ్ఞాపకార్థం కుమారుడు మడకం చందు, పాత్రికేయుడు భాను 500 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా తయారీపై శిక్షణ


శిక్షణా కార్యక్రమానికి హాజరైన బూత్ లెవెల్ అధికారులు

**కదిరి అర్బన్:** స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం రెండో రోజూ ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. బూత్ లెవెల్ అధికారులకు వారి విధులపై శిక్షణ, ఓటరు నమోదు, ఓటరు జాబితా నవీకరణ, ఇంటింటా సర్వేపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.